సచివాలయాల్లో స్పందనకు స్వస్తి!



కవిటి సచివాలయంలో స్పందన ఫిర్యాదుల విభాగం సెల్

- మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం

కవిటి:

గ్రామ స్థాయిలోనే ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి 2000 కుటుంబాలకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు, ఫిర్యాదుల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని అమలు చేసేది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ అధికారులందరూ స్పందన కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించేవారు. దీంతో జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దాదాపు గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యేవి.

కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల్లో స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. దీనికి పేరు మార్చి మండల స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ప్రజలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి, మండల కేంద్రంలో సరైన స్పందన లేకపోతే జిల్లాస్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌కు పరుగులు తీసి తమ సమస్యలు నివేదించుకోవాల్సి వస్తోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాల్లో 94 వరకు వార్డు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో కవిటి మండలంలో 22, కంచిలిలో 22, సోంపేటలో 24, ఇచ్ఛాపురం అర్బన్‌లో 10, ఇచ్ఛాపురం మండలంలో 16 సచివాలయాలు ఉన్నాయి.

తిష్ట వేస్తున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు నివేదించేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలా మంది తమ సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు కుప్పలుగా తిష్ట వేస్తున్నాయి. ప్రధానంగా భూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో మండల కేంద్రంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో పునః సమీక్షించి గ్రామ సచివాలయంలోనే స్పందన కార్యక్రమాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం పునఃసమీక్షించాలి



గ్రామ సచివాలయాల పరిధిలో గతంలో అమలు చేసిన స్పందన ఫిర్యాదుల విభాగాన్ని కొనసాగించాలి. దీనివల్ల గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ అంశంపై బేషజాలకు పోకుండా వాస్తవాల్ని దృష్టిలో పెట్టుకుని పేదలకు మేలుచేసే నిర్ణయంగా స్పందన ఫిర్యాదుల విభాగం సచివాలయాల్లోనే కొనసాగించాలి. దీనిపై ప్రభుత్వం పునఃసమీక్షించాలి.

– కడియాల ప్రకాష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కవిటి

అధికారులు అందుబాటులో ఉండాలి



గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించే గ్రీవెన్స్ ప్రజలకు అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వం దీనికి స్వస్తి చెప్పి మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహిస్తుంది. అయితే అక్కడకు వెళ్తే మండలస్థాయి అధికారులు అందుబాటులో ఉండడం లేదు. ఉన్నతాధికారులతో సమావేశం కోసం జిల్లా కేంద్రానికి వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రీవెన్స్ రోజున అధికారులు అందుబాటులో ఉండడంతోపాటు మండల స్థాయి గ్రీవెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

– పులకల శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ స్టేట్ సెక్రటరీ, కవిటి మండలం

జీడిమామిడిలో పిండినల్లి నివారణకు చర్యలు

- ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శైలజ

వజ్రపుకొత్తూరు: జీడి మామిడి తోటల్లో రసంపీల్చే పురుగు, పిండినల్లి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, నిత్యం యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శైలజ సూచించారు. అమలపాడు గ్రామంలో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పెద్దపేట హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్‌తో కలిసి జీడిమామిడి తోటలను పరిశీలించారు. జీడిమామిడి తోటల్లో పిండినల్లి ఉధృతి ఇదివరకు ఉన్నప్పటికీ సింథటిక్ క్రిమిసంహారక మందులు చల్లడం వల్ల పిండినల్లిని తినే సంహారక పురుగులు నాశనమైయ్యాయని అన్నారు. దీనివల్ల పిండి నల్లి ఉధృతి మరింత పెరిగిందన్నారు. దీనిని పూర్తిగా నివారించాలంటే సబ్బు ద్రావణం పిచికారీ చేసిన తరువాత ప్రొఫెనోఫోస్–2 ఎంఎల్ మందును రెండు లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని అవగాహన కల్పించారు. మండల ఉద్యానవన శాఖ అధికారి కె.సునీత, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు అవినాష్, ప్రశాంత్, సంతోష్, మహాలక్ష్మిపాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ సిబ్బంది

పనిభారం తగ్గించాలని వినతి

నందిగాం: తమపై పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. వివిధ పనులు అప్పగిస్తూ, సకాలంలో పూర్తి చేయడం లేదని నోటీసులు అందిస్తుండటంతో ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రాజారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ సర్వేలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఆయా సర్వేలు సకాలంలో పూర్తి చేయవలసిన రెవెన్యూ సర్వేయర్లు, వీఆర్వోలు, జూనియర్ లైన్‌మెన్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు తమ మాట వినని పరిస్థితి ఉందన్నారు. పని భారం పెరిగి తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగాం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.సంతోష్‌కుమార్, కె.రమణబాబు ఉన్నారు.


ఎంపీడీవో రాజారావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ఐటీడీఏ ఏర్పాటు చేయాలని 25న చలో కలెక్టరేట్

మందస: జిల్లాలో షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటీడీ ని ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు కోరారు. ఇదే డిమాండ్‌తో ఈ నెల 25న చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చినట్లు గిరిజన సంఘం నాయకులు సవర ధర్మారావు, సవర గురునాథ్, సవర ఫాల్గుణరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న కొండ పోరంబోకు, బంజరి భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజన భూముల దురాక్రమణను ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు సవర భాస్కరరావు, రైతులు సంఘం నాయకుడు ధర్మారావు పాల్గొన్నారు.


చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ గ్రామంలోని కేజీబీవీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరు నుంచి ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో పి.శిరీష తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 70751 59996, 70750 39990 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

కంచిలి: మకరాంపురం గ్రామంలోని షిర్డీసాయి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు బెందాళం రమణసాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని కూడా ఇందులో భాగంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొత్తమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం ఊడికలపాడు గ్రామంలోని కొత్తమ్మతల్లి ఆలయంలో బుధవారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నేతింటి అప్పలస్వామి, చిన్నమ్మడు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పన్నుల వసూలు వేగవంతం


మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలో వివిధ పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇళ్లు, నీరు, ఖాళీజాగా పన్నులు, షాపుల అద్దె, స్థల ఆక్రమణ పన్ను, ప్రకటనల పన్నులను ఈనెలాఖరులోగా వసూలు చేయాలని ఆదేశించారు.

బాలల సంరక్షణపై అవగాహన


బాలల రక్షణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: బాలల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలని జీఆర్పీ సిబ్బంది అన్నారు. పలాస రైల్వేస్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై బాలల రక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలబాలికలు ఎటువంటి సమస్యలలో చిక్కుకున్నా 1098 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. జీఆర్పీ హెచ్‌సీ హరినాథ్, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, చైల్డ్ హెల్ప్ డెస్క్ ప్రతినిధి బాలసరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి ఉన్నారు.

పెయింటర్‌కి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక కంద్రవీధిలో నివాసముంటున్న దీర్ఘసి శంకర్ అనే వ్యక్తి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందకు పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కంద్రవీధికి చెందిన శంకర్ వీధి సమీపంలో ఉన్న శివాలయం ఎదురుగా ఉన్న ఇంటి రెండో అంతస్తుకు బుధవారం పెయింటింగ్ వేస్తున్నాడు. అయితే ఆ సమయంలో సపోర్టుగా ఉన్నటువంటి తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. తక్షణమే గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి నడుముకి తీవ్రగాయమైనట్లు తెలిపారు.

సోదరి అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: తన సోదరి ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని టెక్కలిపట్నం గ్రామానికి చెందిన మామిడి జగన్ ఫిర్యాదు చేసినట్లు కాశీబుగ్గ పోలీసులు బుధవారం తెలిపారు. పలాసలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

యువతరం సేవా సమితికి రోటరీ పురస్కారం

వజ్రపుకొత్తూరు: పూండికి చెందిన యువతరం సేవా సమితికి రోటరీ క్లబ్ ఇంటర్‌నేషనల్ సేవా పురస్కారం వరించింది. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ రోటరీ గవర్నర్ డాక్టర్ మల్ల వెంకటేశ్వరరావు యువతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళిని సత్కరించి పురస్కారాన్ని అందించారు. రక్తదాన శిబిరాలు, విద్యా, వైద్య కార్యక్రమాలు, నిరుపేదలకు ఆర్థిక సహాయం, యువతను సన్మార్గంలో నడిపేందుకు చేసిన సేవలకు గాను అవార్డు లభించడం సంతోషంగా ఉందని సేవా సమితి ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.


మురళిని సత్కరిస్తున్న రోటరీ గవర్నర్ వెంకటేశ్వరావు

ధాన్యం కొనుగోలులో రాజకీయం తగదు

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో ధాన్యం కొనుగోలులో గ్రామస్థాయిలో టీడీపీ కార్యకర్తలు రైతులతో రాజకీయం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలకు వచ్చిన టార్గెట్ల విషయంలో టీడీపీ కార్యకర్తలు పూర్తిగా జోక్యం చేసుకుని వారికి అనుకూలంగా ట్రాక్‌షీట్లు నమోదు చేస్తున్నారని దుయ్యబట్టారు. దీని వలన సామాన్య రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కవిటి ఏవోగా శ్రీదేవి

కవిటి: మండల వ్యవసాయాధికారిణిగా నియమితులైన పిరియా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండల ఏఓగా పనిచేస్తున్న ఆమెను డిప్యుటేషన్‌పై ఖాళీగా ఉన్న కవిటి మండలానికి సర్దుబాటు చేస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి సేవలందిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి బి.దుర్గాప్రసాద్‌ను గార మండలానికి బదిలీ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఏఈవోలు బెందాళం శ్రీకల్యాణ్, ఇన్‌చార్జ్ ఏవో బడగల దుర్గాప్రసాద్, కవిటి మండల రైతు సేవాకేంద్రాల సహాయకులు శ్రీదేవికి పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం కవిటి మండలంలో వ్యవసాయశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. ఫార్మర్ రిజిస్ట్రీ, రబీ సాగులో ఎరువుల లభ్యత, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలపై చర్చించారు.


ఏవో శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలి

టెక్కలి: ఆర్టీసీ ఉద్యోగులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్న టీటీఐపై చర్యలు తీసుకుని ఆయా కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ ఉద్యోగులు నినాదాలు చేశారు. బుధవారం టెక్కలి డిపో ఎదురుగా ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 1/2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని, అనకాపల్లి డిపో మేనేజర్ వైఖరి మారాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు టి.ఆర్.మూర్తి, పీవీకే రాజు, ఎస్ఆర్ కుమార్ ఉన్నారు.


నినాదాలు చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు

- డ్వామా పీడీ సుధాకర్

పలాస: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీకుంటామని డ్వామా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్ హెచ్చరించారు. చాలా గ్రామాల నుంచి ఆరోపణలు వస్తున్నాయని, వాటికి ఆధారాలు ఉంటే కఠిన చర్యలు తప్పవన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం మండలంలోని ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. పంచాయితీల వారీగా ఇటీవల జరిగిన తనిఖీల నివేదికలపై చర్చించారు. చాలా గ్రామాల్లో మస్తర్లలో తేడాలు, హాజరులో దిద్దుబాట్లు ఉన్నట్లు గుర్తించారు. గరుడఖండి, కేదారిపురం, అమలకుడియా, బంటుకొత్తూరు గ్రామాల్లో మస్తర్లల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు ఎల్.శంకరరావు, ఎం.తిరుపతిరావు, ఆర్.మణి, జి.హారతిలను మందలించారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా జాబ్‌కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టి వేతనదారులకు తగిన పనిదినాలను ఇవ్వాలని, వేతనం కూడా ప్రభుత్వ నిబంధనలకు అనగుణంగా వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు తమ విధులను నిర్వహించాలని సుధాకర్ చెప్పారు. ఎంపీడీవో కె.వసంతకుమార్, డ్వామా ఫైనాన్స్ మేనేజర్ స్వరూపారాణి, హిరమండలం ఏపీడీ రాధా, పలాస క్లస్టర్ ఏపీడీ సి.హెచ్.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌పీ ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.


ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకర్

సంక్షిప్తంగా...

ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం

పలాస: గ్రామాల్లో 2019–24 మధ్య మంజూరైన ఇళ్లను కట్టుకోలేక వివిధ దశల్లో ఉన్నవాటికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని పలాస సోషల్ డెవలప్‌మెంటు స్పెషలిస్టు సి. హెచ్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసకోవాలని కోరారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్షలు చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. యూనిట్ కాస్ట్ రూ. లక్షా 80 వేలకు ఇది అదనమని చెప్పారు.

జిరాయితీ భూములపై రెవెన్యూకు సంబంధం లేదు


తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

కాశీబుగ్గ: రెవెన్యూ రికార్డుల్లో జిరాయితీ భూమిగా నమోదైన వాటిపై రెవెన్యూ యంత్రాంగం పెత్తనం ఉండదని తహసీల్దార్ టి.కల్యాణ్ చక్రవర్తి స్పష్టం చేశారు. శాసనం గ్రామ పరిధిలో భూములపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని.. అలాంటి వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్ని సామాజిక మధ్యమాలు సర్వే నంబర్ 191/3 పైన తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. అయితే తాము రెవెన్యూ రికార్డులు ప్రకారమే విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రెవెన్యూ అంటే చులకన భావంతో నిందారోపణలు వేయడం సరికాదన్నారు. జిరాయితీ భూములపై రెవెన్యూ సిబ్బందికి అజమాయిషీ ఉండదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా, రికార్డులు పరిశీలించకుండా తమపై అభియోగాలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

టెక్కలి: టెక్కలి మండలం వేములవాడ–విశ్వనాథపురం గ్రామంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తి శ్రద్ధలతో శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో భాగంగా భక్తులకు అన్నదానం చేశారు.

పలాసపురంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

సోంపేట: పలాసపురం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను బుధవారం చేపట్టారు. చెత్తచెదారాలను జేసీబీతో తొలగించి గ్రామానికి దూరంగా తరలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ తడక జోగారావు గ్రామస్తులకు సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెండిగేటు రోడ్డును పూర్తి చేయాలి

వజ్రపుకొత్తూరు: అర్ధాంతరంగా నిలిపివేసిన బెండిగేటు– నువ్వలరేవు రోడ్డును తక్షణమే పూర్తిచేయాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షులు కొర్నాన బాలాజీరావు కోరారు. ఈ మేరకు సంఘ ప్రతినిధులు బుధవారం బెండిలో పర్యటించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. రోడ్డు శిథిలం కావడంతో నడవడానికి ఇబ్బందిగా ఉందని, కల్వర్టులు శిథిలం కావడంతో జరుగుతున్న పనులను అర్ధాంతరంగా నిలిపివేశారని అన్నారు. ఏపీ రైతు సంఘం నేతలు కె.హేమసూధనరావు ఉన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

పలాస: గ్రామాల్లో నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పలాస ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు హెచ్చరించారు. సవరరామక్రిష్టాపురం, పెంటిబద్ర, శాసనాం, మొగిలిపాడు, పురుషోత్తపురం గ్రామాల్లో సారా తాగడం వల్ల కలిగే నష్టాలపై నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. యువత, గృహిణులు సారా నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రూ. పది వేల ఆర్థిక సాయం

కాశీబుగ్గ: పలాస మండలం గురుదాసుపురం గ్రామానికి చెందిన బి. సూర్యం బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దాన సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని సూర్యం కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఎస్‌వీఎస్ఎస్ సభ్యులు తారక్, భవానీ, ప్రేమ్, కిరణ్ ఉన్నారు.

ఆశీళ్ల వసూళ్లకు వేలం ఖరారు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బహిరంగ మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆధ్వర్యంలో బుధవారం వేలం నిర్వహించారు. జోగ మల్లేష్ అనే వ్యక్తి రూ.16 లక్షలకు ఆశీళ్ల వసూళ్లను దక్కించుకున్నారు. అలాగే జంతువధ శాల నిర్వహణకు వేలం నిర్వహించగా అబ్దుల్ రాజేష్ ఖాన్ రూ.50 వేలకు దక్కించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ మేనేజర్ ప్రభాకరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.అమర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయంపై అందరూ అవగాహన పెంచుకోవాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. మండపల్లి పంచాయతీలో అంగన్‌వాడీ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవ ధాన్యాల ప్రాముఖ్యత, రసాయన ఎరువులు వాడకం వలన కలిగే నష్టం, జీవ ఎరువులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఉల్లాస్ వయోజన విద్యకు సంబంధించి 23వ తేదీన పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారిచే పరీక్షలు రాయించాలని సూచించారు.

ఆలయ వార్షికోత్సవం



సోంపేట పట్టణంలోని రమా లక్ష్మీ సమేత సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ ముగింపు పూజలు బుధవారం సంప్రదాయ బద్ధంగా జరిగాయి. ఉదయం లక్ష తులసీ అర్చన, వేదపారాయణ, మహాలింగార్చన పూజలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం విశేష హోమాలు, అన్నప్రసాద వితరణ, పూర్ణాహుతి, స్వామి వారి కల్యాణంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

–సోంపేట

ఆర్టీసీ కార్మికుల ధర్నా



పలాస ఆర్టీసీ డిపో మెయిన్ గేటు వద్ద బధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. సమస్యలను పరిష్కరించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, పనిభారం తగ్గించాలని తదితర డిమాండ్లతో గేట్ మీటింగు పెట్టి ధర్నా చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతు నినాదాలు చేశారు. డిపో సెక్రటరీ ఎ.వి.రావు, పున్నయ్య, వాలి, డిపో, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

–పలాస

చలివేంద్రం ప్రారంభం



మండల కేంద్రం కంచిలిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణికులబస్టాండు వద్ద చలివేంద్రాన్ని కంచిలి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. దీన్ని స్థానిక సర్పంచ్ ఎల్.లక్ష్మి బుధవారం ప్రారంభించారు. దాతల సహకారంతో మజ్జిగ, నిమ్మకాయ రసం నీళ్లు, మంచినీటిని పంపిణీ చేయడానికి నిర్ణయించారు. మొదటిరోజున మజ్జిగను సరఫరా చేశారు. తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎస్సై పి.పారినాయుడు, ఈఓపీఆర్డీ ఈశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఇ.రాంబాబు, స్థానిక నాయకుడు జగదీష్ పట్నాయక్ పాల్గొన్నారు.

–కంచిలి